క్లుప్తంగా

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలను శనివారం నిర్వహించారు. వైద్యులు విజయ్‌కుమార్, రమేష్‌బాబు 350 మంది వాకర్స్‌కు వైద్యపరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, నాయకులు స్వర్ణ రమేష్ బాబు, డీవీ సుబ్బరాజు, గోపాల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ప్రసాద్, బుర్రా వెంకటేశ్వర్లు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నమోదు చేసుకోండి



నెల్లూరురూరల్: జిల్లా ఆర్కెస్ట్రా, మ్యూజీషియన్ అసోసియేషన్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో కొత్తగా ఎన్నికలకు ఓట్ల నమోదు చేసుకోవాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 10వ తేదీలోపు పాత సభ్యులతో పాటు కొత్తగా చేరే సభ్యులు కూడా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీవన్, మదన్ మిశ్రా, భాస్కర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యునెక్స్ సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 15 బ్యాడ్మింటన్ పోటీల్లో రెండో రోజు శనివారం క్రీడాకారులు ఉత్సాహంగా తలపడ్డారు. 60 టీమ్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, సాయంత్రం ఫైనల్స్, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు.

కవి రామకృష్ణకు పురస్కారం



పెరుగు రామకృష్ణ

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన కవి డాక్టర్ పెరుగు రామకృష్ణను 'వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ పొయెట్స్' వారు 'ప్రెసిడెన్షియల్ మెడల్'కు ఎంపిక చేశారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు, మెక్సికోకు చెందిన డాక్టర్ మారియా యూజెనీస్ సోబరీన్స్ శనివారం ప్రకటించారు. మెక్సికోలో వచ్చే సెప్టెంబర్ 21 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న 44వ ప్రపంచ కవుల మహాసభలో ఆయన పురస్కారం అందుకోనున్నారు.

7.6 లక్షల మంది ప్రయాణం



షమీమ్

నెల్లూరు సిటీ: జిల్లాలోని ఆర్టీసీ బస్సుల్లో 7.6 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకం ప్రారంభమైందన్నారు. 22వ తేదీ(శుక్రవారం) వరకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ వంటి మూడు రకాల బస్సుల్లో మొత్తం 14,88,537 మంది ప్రయాణించారన్నారు. వీరిలో మహిళలు 7,64,311 మంది కాగా, టికెట్లు తీసుకుని ప్రయాణించిన పురుషులు 7,24,226 మంది ఉన్నారని తెలిపారు. మూడు రకాల బస్సుల్లో మహిళా ప్రయాణికులు క్రమంగా పెరుగుతుండగా, పురుషుల సంఖ్య తగ్గుతోందన్నారు.

25న మహాధర్నా

నెల్లూరు (టౌన్): మెమో 57 అమలు చేయాలని కోరుతూ ఈనెల 25వ తేదీన విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మణిసుబ్బు, మాస ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీ కంటే ముందుగా నియామక ప్రక్రియ పూర్తయి పరిపాలనా కారణాల వల్ల అదే సంవత్సరం సెప్టెంబర్ తరువాత విధుల్లో చేరిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. ఆ మెమో విడుదలై సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మెమో 57ను అమలు చేసి 11 వేలకు పైగా ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. ఈ ధర్నాకు బీటీఏ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

తింటే రోగాలే

- చిరుతిండ్లలో నాణ్యతకు తిలోదకాలు
- పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- పట్టించుకోని అధికారులు

మార్కెట్‌లో లభించే స్నాక్స్ వంటి చిరుతిళ్లలో కొన్ని నాసిరకంగా ఉంటున్నాయి. అధిక మోతాదులో ఉప్పు, కారంతో పాటు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హానికరమైన రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇలాంటివి తింటే రోగాలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినా వీటిని నిరోధించే వారు కరువయ్యారు.

నెల్లూరు(బారకాసు): చిన్నారులు అమితంగా ఇష్టపడే స్నాక్స్‌పై కొందరు వ్యాపారులు దృష్టి కేంద్రీకరించారు. సంపాదనే ధ్యేయంగా నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిచ్చేస్తున్నారు. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు దగ్గరగా అంటే ఒకటి, రెండు అక్షరాలు మార్చివేసి మార్కెటింగ్ చేస్తూ వేగంగా విక్రయాలు చేసుకుంటున్నారు. నెల్లూరు నగర నియోజకవర్గంలోని స్టోన్‌హౌస్‌పేట, పెద్దబజార్, చిన్నబజార్ తదితర ప్రాంతాల్లో హోల్‌సేల్ దుకాణాల ద్వారా ఆయా స్నాక్స్ ప్యాకెట్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న చిన్న చిన్న దుకాణాలకు సరఫరా కావడంతో శరవేగంగా అమ్ముడుపోతోంది.

ప్రతినెలా రూ.కోటి సరుకు దిగుమతి

చెన్నై, విజయవాడ, హైదరాబాద్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నెల్లూరు నగరానికి దాదాపు రూ.కోటి విలువ చేసే తినుబండరాలు ప్రతి నెలా దిగుమతి అవుతున్నాయి. ఒక్కో హోల్‌సేల్ వ్యాపారికి నెలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు తినుబండరాలు కోసం వెచ్చిస్తున్నారు.

ప్యాకెట్‌కు రూపాయి కమీషన్

బ్రాండెడ్ కంపెనీ తయారు చేసే కుర్‌కురే, కరాచి, చిప్స్ తదితర తినుబండరాలు అమ్మితే ఒక ప్యాకెట్‌పై 50 పైసలు కమిషన్ వస్తుంది. అదే నాసిరకం తినుబండరాలు విక్రయిస్తే ప్యాకెట్‌కు రెట్టింపు అంటే రూపాయి కమీషన్ వస్తుండటంతో చాలా మంది వ్యాపారులు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీ చిప్స్ 12 ప్యాకెట్లు ఉండే ఒక షీట్ అమ్మితే రూ.6 కమీషన్ వస్తుంది. అదే నాసిరకం చిప్స్ అమ్మితే రూ.12 వస్తుంది.



నాణ్యత లేని తినుబండారాలు

నామమాత్రంగా తనిఖీలు

మార్కెట్‌లో లభించే చిరు తినుబండరాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన ఆహార తనిఖీ, మున్సిపల్, తూనికలు, కొలతల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పెద్ద మొత్తాల్లో ముడుపులు అందడంతో పర్యవేక్షణను గాలికొదిలేశారని ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. చిరుతిళ్లకు సంబంధించి పెద్దగా గిట్టుబాటు కావడం లేదని అధికారులు తనిఖీలకు వెళ్లడం లేదనే విమర్శలు ఉన్నాయి.

రసాయనాల వినియోగం

మార్కెట్‌లో దొరికే చిరుతిళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉండటానికి పలు రకాల రసాయనాలు వాడుతారు. రుచి ఎక్కువగా ఉండటానికి అధిక మోతాదులో మసాలాలు, టేస్టింగ్ సాల్టు కలుపుతారు. రంగుల కోసం పలు రకాల పౌడర్లు ఉపయోగిస్తారు. వీటిని పిల్లలు ఎక్కువగా తింటే భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తప్పవని, ప్రమాదకరమైన వ్యాధులు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

దూరంగా ఉండాలి

మార్కెట్‌లో దొరికే చిరు తినుబండారాలు, జంక్‌ఫుడ్‌కు ప్రజలు దూరంగా ఉండాలి. రుచి, నిల్వ కోసం వాటిలో ఉపయోగించే రసాయనాలు, రంగులతో కడుపునొప్పి, అజీర్తి వంటి తక్షణం సంభవించే వ్యాధులతో పాటు భవిష్యత్తులో ఎసిడిటీ, జీర్ణకోశ, కిడ్నీ, పేగు సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి తినుబండారాలపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు చేపడుతాం.

– డాక్టర్ కనకాద్రి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, నెల్లూరు నగరపాలక సంస్థ



ఫైల్స్‌పై ఉన్న శ్రద్ధ పనుల్లోనూ చూపండి

- అధికారుల పనితీరుపై మండిపడిన మేయర్



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): వివిధ ఫైల్స్‌పై సంతకాల పెట్టించుకోవాలన్న శ్రద్ధ అభివృద్ధి పనుల్లో చూపించండి.. పనులు చేశారో లేదో తెలియజేయకుండానే బిల్లులకు సంబంధించిన ఫైల్స్‌ను తన వద్దకు తీసుకొచ్చి సంతకాలు పెట్టించుకోవాలని చూడడం సరికాదు.. ఒకే రకమైన పనికి రెండు ఫైల్స్‌ను తయారు చేయడం మంచి పద్ధతి కాదని మేయర్ పొట్లూరి స్రవంతి ఎన్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులపై మండిపడ్డారు. నగరవ్యాప్తంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి ఒకటిన్నర సంవత్సరం కావస్తున్నా పనులు ప్రారంభించకపోవడం, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి చేయాల్సిన ప్రతిపాదనల ఆలస్యంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె చాంబర్లో వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలోని గణేష్ ఘాట్, పెన్నా బ్యారేజీ తిక్కన పార్కు వద్ద నిమజ్జనం కోసం పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని, గ్రీవెన్స్ డేలో అందే అర్జీలకు వేగంగా పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో

నెల్లూరురూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఆర్వో హుస్సేన్‌సాహెబ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగువారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చిన దేశభక్తుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన్ను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది ఉన్నారు.

⇨ నెల్లూరు(బృందావనం): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శనివారం ఏసీ కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఆంధ్రకేసరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన ఆంధ్రకేసరి బ్రిటీష్ వారిపై చేసిన పోరాటం, దేశం కోసం చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో భువనేశ్వరి ప్రసాద్, బ్రాహ్మణ సంఘాల జిల్లా అధ్యక్షుడు జి.వాసుదేవరావు, శ్రీకంఠం రమణయ్య, వెంకటేశ్వర్లు, సుభహాన్‌బాషా, శేషయ్య నాయుడు, రామిరెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయంలో..

నెల్లూరు(పొగతోట): టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను జెడ్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆంధ్రకేసరిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

వైభవంగా మహాగణపతి ఆగమనం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): చంద్రమౌళీనగర్‌లోని 8వ వీధిలో వినాయక చవితి పండగను పురస్కరించుకుని మహాగణపతి ఆగమన కార్యక్రమం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డీకేడబ్ల్యూలో హెచ్ఐవీపై అవగాహన



విద్యార్థినులకు క్విజ్ పోటీలు

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాధిపై విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుజాత, జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైమ్): ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. డైకస్‌రోడ్డు ఎస్సీసీ కాలనీలో సుధాకర్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుటుంబం శనివారం ఇంట్లో లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీనిని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని డీఎల్ఎన్నార్ పాఠశాలలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈశా ఫౌండేషన్ వలంటీర్లు లాభాపేక్షలేకుండా క్రీడలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం



నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి-ఇందూజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత శ్లోకాల రాత పరీక్షల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానోత్సవం శనివారం నిర్వహించారు. డైకస్ రోడ్డు సెంటర్ పొగాకు గోడౌన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆ వేదిక నగరాధ్యక్షుడు సూరమౌళి మాట్లాడుతూ నగర స్థాయిలో జరిగిన పరీక్షలో వి.చైత్ర, నాగలక్ష్మి ప్రసన్న, బి.ప్రణీతలు మొదటి మూడు బహుమతులు గెలుపొందారన్నారు. అలాగే మానస, అనిల్‌కుమార్, షేక్ అహ్మద్, హేమంతు, సౌజన్య, నివేత్రలకు ప్రోత్సాహక బహుమతులు, భగవద్గీత గ్రంథాలను అందజేశామన్నారు. నిర్వాహకులు కేవీ రత్నం, ఎస్వీ రామయ్య, సీహెచ్ లక్ష్మయ్య, శ్రీనివాసులు, బి.శ్రీదేవి, సీహెచ్ సుదర్శనమ్మ, కె.వసుంధర తదితరులు పాల్గొన్నారు.



కాకాణిని భుజాలపై ఎత్తుకుని కేరింతలు కొడుతున్న కార్యకర్తలు

వెల్లువెత్తిన అభిమానం

- కాకాణికి ఘన స్వాగతం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసుల్లో జిల్లా కేంద్ర కారాగారం నుంచి విడుదలై తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు శనివారం ఘన స్వాగతం పలికారు. మినీబైపాస్ నుంచి పొదలకూరు రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఆయన్ను కలుసుకునేందుకు ఉత్సాహం చూపారు. పోలీసు ఆంక్షలను లెక్కచేయకుండా అడుగడుగునా తమ అభిమానాన్ని చాటారు. సర్వేపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న మహిళలు



కాన్వాయ్‌లో ర్యాలీగా వస్తున్న కాకాణి

ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

కొడవలూరు: ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఎంహెచ్ఓ మాట్లాడుతూ హెచ్ఐవీ, టీబీ వంటి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. పిల్లల ఎదుగుదలకు దోహదపడే ఆరోగ్య సూత్రాలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత విధిగా పాటించాలన్నారు. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కామాక్షయ్య, హెచ్ఎం మోహనరామలింగయ్య, హెచ్ఈఓ కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

వెంకటాచలం: ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. మండలంలోని కాకుటూరు పంచాయతీలో శనివారం ఆమె పర్యటించారు. పారిశుధ్యం నిర్వహణను పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 15 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి డ్రైనేజీ కాలువలు లేని ఇళ్ల వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా రూ.6వేలు ఖర్చు చేసి పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ఆమె వెంట ఏపీఓ శిరీష, సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములవ్వాలి



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీఆర్వో హుస్సేన్ సాహెబ్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణ పరిరక్షణకు సహకారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై కఠిన చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాల నిషేధానికి కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్ఓ డాక్టర్ కనకాద్రి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరవ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించేలా శనివారం వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కరెంటాఫీస్ కూడలి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం, మన్సూర్ నగర్, విరాట్ నగర్, గాంధీ బొమ్మ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎంహెచ్ఓ, ఎస్ఈలు పాల్గొని, ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచేలా నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని తెలియజేశారు. ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, వార్డు సచివాలయ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

⇨ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు స్థానిక మన్సూర్ నగర్ ప్రాంతంలో శనివారం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి పారిశుద్ధ్య నిర్వహణ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుశాఖ ఆధ్వర్యంలో..

నెల్లూరు(క్రైమ్): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా వర్షాకాలంలో వరదలు-అంటు వ్యాధుల నివారణ అంశంపై జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వరదలను ఎదుర్కొనేందుకు ఉపయోగించే సాధనాలు, మంటలను ఆర్పే పరికరాలు(ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), లైవ్ జాకెట్స్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసు కార్యాలయం నుంచి డీకేడబ్ల్యూ జంక్షన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్ మాట్లాడుతూ అడవులను పెంచడం ద్వారా కరువు రాకుండా ఉంటాయని, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రపంచాన్ని కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, అడ్మిన్, ఎంటీ ఆర్ఐలు అంకమరావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

నెల్లూరు (టౌన్): సంతపేటలోని గుంతబడి (మోడల్‌స్కూల్)లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి రాధయ్య, హెచ్ఎం దయాకర్, మలేరియా నివారణాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాఖ ఆధ్వర్యంలో..

నెల్లూరు(అర్బన్): నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. పలువురు ఉద్యోగులు, డాక్టర్లు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ సుజాత ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ కవర్లను, గ్లాసులను వినియోగించబోమని, పరిసరాల ఆరోగ్యాన్ని కాపాడుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ రమేష్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, డీఎంఓ హుస్సేనమ్మ, న్యూక్లియస్ వైద్యాధికారి సురేంద్ర, డెమో అధికారి కనకరత్నం, డీఎస్ఓ డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పాల్గొని, మాట్లాడారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతుల శుభ్రం, ఆహార పరిశుభ్రత పాటించాలన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీప్రసన్న, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్ఎంసీ అధికారులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో



అగ్నిమాపక పరికరాలను పరిశీలిస్తున్న ఏఆర్ డీఎస్పీ, అధికారులు